కూర కుధరడం లేదు

- మండుతున్న కూరగాయల ధరలు
- కేజీ రూ.100 దాటిన టమాటా, పచ్చిమిర్చి, చిక్కుడు
- చికెన్‌తో పోటీ పడుతున్న అల్లం
- ఆందోళన చెందుతున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలు


గోకవరంలో అమ్మకానికి సిద్ధం చేసిన కూరగాయలు

గోకవరం: కూరగాయల ధరలు మండుతున్నాయి. నిత్యావసరాల్లో ప్రధానమైన కూరగాయల ధరలు ఒక్కసారిగా పెరగడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా టమాటా, అల్లం, పచ్చిమిర్చిని వంటింట్లో మహిళలు ప్రతి కూరలోనూ వాడుతుంటారు. వీటిలో టమాటా, పచ్చిమిర్చి, చిక్కుడు ధర ప్రస్తుతం కేజీ రూ.100 పైబడి ఉండగా అల్లం ధర చికెన్‌తో పోటీ పడుతోంది. ధరలు భారీగా పెరగడంతో సామాన్యులకు ఏం కొనాలో, ఏం తినాలో తెలియని పరిస్థితి నెలకొంది.

20 రోజుల్లో రెట్టింపు

కొద్దిరోజుల క్రితం వరకు కేజీ రూ.20 లోపు ఉండే కూరగాయలన్నీ ఇప్పుడు రెట్టింపు ధరలు పలుకుతున్నాయి. బహిరంగ మార్కెట్‌లో టమాటా, పచ్చిమిర్చి, చిక్కుడు కేజీ రూ.120 ఉండగా, అల్లం రూ.220 ఉంది. క్యాప్సికమ్, బీరకాయ, వంకాయ, చామదుంప వంటివి రూ.50 పైబడి ఉన్నాయి. మిగిలిన కూరగాయలకు సైతం ధరలు పెరగడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

మండలంలోని గోకవరం, కొత్తపల్లి గ్రామాల్లో ప్రతి సోమవారం వారపుసంత జరుగుతుంది. సాధారణంగా బయట మార్కెట్ కంటే ఈ వారపు సంతలో కూరగాయల ధరలు తక్కువగా ఉంటాయి. రైతులే నేరుగా ఇక్కడకు కూరగాయలు తెచ్చి విక్రయిస్తారు. కాగా ప్రస్తుతం వారపు సంతలో సైతం కూరగాయల ధరలు అధికంగానే ఉన్నాయి. మండలంలోని గోకవరం, అచ్యుతాపురం, గుమ్మళ్లదొడ్డి, తిరుమలాయపాలెం, కొత్తపల్లి, కామరాజుపేట, తదితర గ్రామాల్లో రైతులు వంకాయ, దొండకాయ, బీరకాయ, ఆనబ, ఆకాకర, బెండకాయ, అరటికాయ తదితర కూరగాయలను పండిస్తున్నారు. అలాగే ఏజెన్సీలోని దేవీపట్నం మండలంలో వంకాయలు విరివిగా పండిస్తారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు దెబ్బతినడంతో కూరగాయల ధరలు పెరిగినట్టు రైతులు చెబుతున్నారు. మరో నెలరోజుల పాటు ఇదే పరిస్థితి ఉండే అవకాశం ఉందని వ్యాపారులు భావిస్తున్నారు. మరోపక్క గత వారంతో పోలిస్తే కోడిమాంసం ధర రూ.40 వరకూ తగ్గింది. ప్రస్తుతం చికెన్ బ్రాయిలర్ రూ.240, ఫారం రూ.200కు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం కూరగాయల్లో ప్రధానపాత్ర పోషించే ఉల్లి ధర రూ.20 ఉండటం సానుకూలాంశంగా ప్రజలు భావిస్తున్నారు.

ప్రస్తుతం గోకవరం మార్కెట్లో కూరగాయల ధరలు (కేజీల్లో)

కూరగాయలు	ధర (రూ.)
ఉల్లిపాయలు	20
అల్లం	220
టమాటా	120
చిక్కుడుకాయ	120
క్యాప్సికమ్	80
పచ్చిమిర్చి	120
వంకాయ	60
బీరకాయ	60
బీట్‌రూట్	40
క్యారెట్	35
బెండకాయ	35
దొండకాయ	35
చామదుంప	50
బంగాళదుంప	25
క్యాబేజీ	25
కీరదోస	40
చిలకడదుంప	40
ములక్కాడ	50

అమ్మకాలు తగ్గాయి

గత వారం రోజులుగా కూరగాయల ధరలు పెరుగుతున్నాయి. మండలంలో పంటలు దెబ్బతినడంతో దిగుబడి తగ్గింది. ఆ ప్రభావం ధరలపై పడింది. ధరలు పెరగడంతో అమ్మకాలు సైతం తగ్గాయి.
– సూర్యచంద్ర, కూరగాయల వ్యాపారి, గోకవరం

క్లుప్తంగా

వెల్ఫేర్ అసిస్టెంట్ రాజుకు సత్కారం


ధర్మవరం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్ రాజును సన్మానిస్తున్న ఉద్యోగులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం సచివాలయం-3 వెల్ఫేర్ అసిస్టెంట్ గీసాల రాజుకు సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఆయన ధర్మవరం నుంచి యు.కొత్తపల్లి మండలం నాగులాపల్లి సచివాలయానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామ సచివాలయంలో వీడ్కోలు సభ నిర్వహించారు. వెల్ఫేర్ అసిస్టెంట్‌గా రాజు చేసిన సేవలను కొనియాడు. అనంతరం ఆయనను పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

జి.కొత్తపల్లిలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్


జి.కొత్తపల్లిలో జేసీబీతో వ్యర్థాలు తొలగిస్తున్న దృశ్యం

శంఖవరం: పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని జి.కొత్తపల్లి సర్పంచ్ ఈగల విజయదుర్గ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో ఆదివారం ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించారు. పంచాయతీ సిబ్బంది రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను తొలగించారు. డ్రైన్లలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. దోమల నివారణ మందు పిచికారీ చేశారు. గ్రామాన్ని వ్యర్థ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సర్పంచ్ కోరారు.

ఆ భూములను పేదలకు పంచాలి


చినమల్లపురం కొండ పోరంబోకు భూముల వద్ద నిరసన తెలుపుతున్న లిబరేషన్ శ్రేణులు

రౌతులపూడి: చిన్నమల్లపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్1, 2/4 లో ఉన్న కొండ పోరంబోకు భూములను పేదలకు పంచాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ శ్రేణులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం అఖిల భారత గ్రామీణ కార్మిక సంఘం మండలాధ్యక్షుడు నారాయణమూర్తి ఆధ్వర్యంలో ఆ భూముల వద్దకు వెళ్లి ఎర్ర జెండాలు పాతారు. రైతులు సాగు చేసుకుంటున్న పోరంబోకు భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కర్రి సత్యవతి, డి.దుర్గాప్రసాద్, జి.సుబ్రమణ్యం, జి.సత్యవతి పాల్గొన్నారు.

గ్రామాల్లో టీడీపీ బస్సు యాత్ర


జెడ్.రాగంపేట పరిణయ ఫంక్షన్ హాల్ వాల్ పోస్టర్లు చూపిస్తున్న టీడీపీ నాయకులు

జగ్గంపేట/గండేపల్లి/గోకవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతిందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. నియోజవర్గంలో భవిష్యత్ గ్యారంటీ చైతన్య బస్ యాత్ర ముగింపు సందర్భంగా గండేపల్లి మండలం జెడ్.రాగంపేటలోని పరిణయ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వంపై పలు విమర్శలు చేశారు. తొలుత జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో జగ్గంపేట టీడీపీ కార్యాలయం నుంచి భవిష్యత్ గ్యారంటీ చైతన్య బస్సు యాత్ర ప్రారంభమైంది. నియోజకవర్గంలోని జగ్గంపేట, గోకవరం, గండేపల్లి, మండలాల్లో కొనసాగింది. టీడీపీ నాయకులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, చిక్కాల రామచంద్రరావు, గొల్లపల్లి సూర్యారావు, పీతల సుజాత, జవహర్, నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి జ్యోతుల నవీన్ కుమార్ పాల్గొన్నారు.

శాకంబరిగా ముత్యాలమ్మ

సామర్లకోట: స్థానిక కాకినాడ రోడ్డులో ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారిని ఆదివారం శాకంబరిగా అలంకరించారు. ముత్యాలమ్మ అమ్మవారిని కుమారరామ భీమేశ్వరస్వామి దేవస్థానం దీపారాధన సంఘ సభ్యులు కూరగాయలు, పండ్లతో అలంకరించి పూజలు చేశారు. ఆదివారం కావడంతో కార్లు, బస్సులు, లారీలు, ద్విచక్ర వాహనాలపై వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో కాకినాడ రోడ్డు తిరునాళ్లను తలపించింది.

జోరుగా పింఛన్ల పంపిణీ


ఏలేశ్వరంలో లబ్ధిదారుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ స్వాతి


తునిలో శేషారత్నానికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ప్రవల్లిక

ఏలేశ్వరం: వైఎస్సార్ పింఛన్ కానుకలో భాగంగా పట్టణంలో ఆదివారం రెండోరోజూ పింఛన్లు పంపిణీ చేశారు. పట్టణంలో సుమారు రెండు వేలకు పైగా పింఛనుదారులు ఉండగా 98 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేసినట్టుఅధికారులు తెలిపారు. గతప్రభుత్వంలో పింఛన్ల కోసం లబ్ధిదారులు రోజుల తరబడి ఎదురు చూసేవారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద పడిగాపులు కాసేవారు. ప్రస్తుతం ప్రతినెలా ఒకటో తేదీన ఠంచన్‌గా పింఛను అందుతుండడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తుని వెళ్లి పింఛన్ అందజేత

ప్రత్తిపాడు: స్థానిక సాయి నగర్‌కు చెందిన వృద్ధురాలు మిస్త్రీ శేషారత్నం తునిలోని బంధువుల ఇంటికి వెళ్లింది. అక్కడ అనారోగ్యానికి గురై చికిత్స పొందుతోంది. ఆమె పింఛను లబ్ధిదారు కావడంతో స్థానిక వలంటీర్ పుట్టా సాయి రత్న ప్రవల్లిక ఆదివారం తుని వెళ్లి అనారోగ్యంగా ఉన్న శేషారత్నానికి పింఛన్ సొమ్ము అందజేసింది. సుమారు 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న వృద్ధురాలికి పింఛన్ సొమ్ము అందజేసిన వలంటీర్‌ను పలువురు అభినందించారు.

డప్పు కళాకారులకు పింఛన్ మంజూరు చేస్తాం


మంత్రి దాడిశెట్టి రాజాకు వినతిపత్రం అందజేస్తున్న ఆరుగుల మోషే, దళిత నాయకులు

మంత్రి దాడిశెట్టి రాజా

తుని: డప్పు కళాకారులు, చెప్పులు కుట్టుకునే దళితులకు పింఛన్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని మండలం ఎస్.అన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు ఆరుగుల మోషే ఆధ్వర్యంలో డప్పు కళాకారులు మంత్రి రాజాను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ పింఛన్ సదుపాయం కల్పిస్తోందన్నారు. అర్హుల నుంచి దరఖాస్తులు తీసుకుని పింఛన్ మంజూరు చేయాలని అధికారులకు సూచించారు. డీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మోర్త అబ్బులు, మండలశాఖ అధ్యక్షుడు కె.ప్రేమ్‌కుమార్, పల్లేటి ప్రేమ సాగర్ పాల్గొన్నారు.

ప్రజాగర్జన సభను విజయవంతం చేయాలి

ప్రత్తిపాడు: గుంటూరు నాగార్జున యూనివర్శిటీ ప్రాంగణంలో ఈ నెల 23న పారిశ్రామిక వేత్త బోడే రామచంద్రయ్య యాదవ్ నూతన పార్టీ ఆవిష్కరణ సందర్భంగా నిర్వహించే ప్రజా గర్జన సభను విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గొంప శివకుమార్ కోరారు. ప్రత్తిపాడులో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బోడే రామచంద్రయ్య యాదవ్ నూతన పార్టీ ఏర్పాటు చేస్తున్న దృష్ట్యా మండల స్థాయిలో బీసీ సంక్షేమ సంఘాలను బలోపేతం చేస్తున్నట్టు చెప్పారు. నియోజవర్గ సంఘ యువజన అధ్యక్షుడిగా ఇసరపు సురేష్, మండలాధ్యక్షుడిగా మొరుకుర్తి నాగేంద్ర, ఉపాధ్యక్షులుగా రాజారపు చక్రరావు, కొర్ని ప్రకాష్‌లను నియమించినట్టు చెప్పారు. విజయవాడ–గుంటూరు బైపాస్ రోడ్డులో ఈ నెల 9న ఏర్పాటు చేయనున్న ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ములాయం సింగ్ యాదవ్ విగ్రహావిష్కరణలో బీసీలందరూ పాల్గొని ఐక్యత చాటాలని కోరారు. సమావేశంలో సంఘ కిర్లంపూడి మండలాధ్యక్షుడు నైదాన రఘు, బీసీ నాయకులు కుండల శ్రీను, కొల్లు గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటాలి


ప్రథమ స్థానం సాధించిన పల్నాడు జిల్లా బాలికలు, బాలుర జట్లను అభినందిస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి తదితరులు

మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి

తుని: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ సత్తా చాటాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఏలూరి సుధారాణి సూచించారు. తుని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం రాష్ట్ర 5వ సబ్ జూనియర్స్ బాలురు, బాలికల ఆట్యా, పాట్యా అంతర్ జిల్లాల చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. 14 జిల్లాల నుంచి 400 మంది బాల, బాలికలు పోటీల్లో పాల్గొన్నారు. రెండు రోజల పాటు జరిగిన ఈ పోటీల్లో పలు విభాగాల్లో ప్రతిభ చూపిన బాలికలకు చైర్‌పర్సన్ సుధారాణి బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో బాలురు ప్రథమస్థానం (పల్నాడు జిల్లా), ద్వితీయ స్థానం విశాఖపట్నం, తృతీయ స్థానం అనకాపల్లి, గుంటూరు, నాల్గో స్థానం తూర్పు గోదావరి, బాలికల విభాగంలో ప్రథమ స్థానం పల్నాడు, ద్వితీయ స్థానం కర్నూల్, తృతీయ స్థానం అనకాపల్లి, గుంటూరు జిల్లాలు సంయుక్తంగా విజయం సాధించాయని ఆట్యా, పాట్యా అసోసియేషన్ సీఈవో ఆర్ ప్రసాద్ తెలిపారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాలను తుని లయన్స్ క్లబ్ సభ్యులు కల్పించారు. తుని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కలిదిండి సత్యనారాయణ రాజు, కేఎస్ జాబేజ్, చరణ్, జీవీవీ సత్యనారాయణ, ప్రశాంత్ కుమార్, వైఎస్సార్ సీపీ తుని మండలశాఖ అధ్యక్షుడు పోతల రమణ, జి.విక్టర్‌బాబు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు సీటు బీసీలకు కేటాయించాలి


సమావేశంలో పాల్గొన్న సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ నాయకులు

ప్రత్తిపాడు: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్తిపాడు సీటును బీసీలకు కేటాయించాలని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. స్థానిక టి.రాయవరం రహదారిలోని పుష్కర కాలువ సమీపాన ఆదివారం సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు బొట్టు శ్రీను మాట్లాడుతూ బీసీ సామాజిక వర్గం అత్యధికంగా ఉన్న ప్రత్తిపాడు అసెంబ్లీ స్థానాన్ని బీసీలకు కేటాయించాలన్నారు. నియోజకవర్గంలోని బీసీలంతా ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యా శ్రీనుబాబు, సంఘ జిల్లా నాయకులు ముచ్చు అప్పలరాజు, బుల్లిరాజు, సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు మదినే సూకరాజు, కార్యదర్శి కట్టమూరి కొండబాబు, ధరణాలకోట తాతబ్బాయి, ప్రత్తిపాడు, రౌతులపూడి సంఘాధ్యక్షులు ఉమ్మి గంగరాజు, సుర్ల సత్తిబాబు పాల్గొన్నారు.

అసంపూర్తిగా హాస్టల్ నిర్మాణ పనులు


కోటనందూరు హైస్కూల్లో అసంపూర్తిగా నిలిచిన హాస్టల్ నిర్మాణ పనులు

కోటనందూరు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో చేపట్టిన బాలికల వసతిగృహం నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. రూ.1.94 కోట్ల ఆర్ఎంఎస్ఏ నిధులతో చేపట్టిన ఈ హాస్టల్ నిర్మాణ పనులను రెండేళ్ల క్రితానికే పూర్తి చేస్తామని పంచాయతీరాజ్‌శాఖ ఇంజినీరింగ్ అధికారులు గతంలో ప్రకటించినప్పటికీ పనులు ఆ దిశగా జరగలేదు. శ్లాబ్ లెవెల్ వరకూ పనులు వేగంగా పూర్తి చేసిన కాంట్రాక్టర్ తుదిదశ పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. నిర్ణీత సమయం గడిచిపోయినా హాస్టల్ నిర్మాణ పనులు పూర్తి చేయకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండల కేంద్రమైన కోటనందూరులో ఈ హాస్టల్ అందుబాటులోకి వస్తే మండలంతో పాటు పక్కనే ఉన్న రౌతులపూడి, అనకాపల్లి జిల్లా నాతవరం మండలాల్లో విద్యార్థినులకు ఎంతో జరుగుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి హాస్టల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


పారా లీగల్ వలంటీర్ల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న జడ్జి కాటం భాను

ప్రత్తిపాడు: పారా లీగల్ వలంటీర్లు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని న్యాయ సేవా కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి కాటం భాను అన్నారు. ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో నూతనంగా ఎంపికైన పారా లీగల్ వలంటీర్లకు రెండు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ముగింపు సభలో జడ్జి కాటం భాను మాట్లాడుతూ పేదలకు న్యాయ సహాయం అందించడంలో పారా లీగల్ వలంటీర్లు ముందుండాలన్నారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ప్యానెల్ అడ్వకేట్లు బుగత శివ, బొంగుకూరి మధుబాబు, అవసరాల దేవి, మల్లేశ్వరరావు, కూసుమంచి సూర్యప్రకాష్ తదితరులు వివిధ చట్టాలపై వలంటీర్లకు అవగాహన కల్పించారు. అనంతరం పారా లీగల్ వలంటీర్లు స్థానిక సబ్ జైలును సందర్శించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టంశెట్టి పుల్లయ్య, లోక్ అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి, సీనియర్ న్యాయవాదులు పిల్లి బలరాముడు, ఆకుల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

'స్పందన' సేవలు ప్రశంసనీయం


కుట్టు శిక్షణలో సర్టిఫికెట్లు పొందిన మహిళలు

అన్నవరం: మహిళల అభ్యున్నతికి స్పందన రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని స్థానిక ఎస్సై అజయ్ బాబు అన్నారు. స్పందన ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆరు నెలల పాటు 15 మంది మహిళలకు ఉచితంగా కుట్టు మెషీన్‌లో శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఆదివారం ఎస్సై కుట్టు మెషీన్లు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ వైస్ ప్రెసిడెంట్ ప్రదీప్ వర్మ, అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ పెదపాటి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్ల పాలనపై కరపత్రాల పంపిణీ


ఏలేశ్వరంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు

ఏలేశ్వరం: కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టి తొమ్మిదేళ్లు పూర్తయిన నేపథ్యంలో పట్టణంలో ఆదివారం కరపత్రాలు పంపిణీ చేశారు. బీజేపీ పట్టణ కార్యదర్శి గొల్లపూడి సత్యనారాయణ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం ప్రగతి పథంలో పయనిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమలో పార్టీ నాయకులు ఏనుగు ధర్మరాజు, దాకే కృష్ణారావు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మించాలని వినతి


ఇర్రిపాకలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుకు వినతిపత్రం సమర్పిస్తున్న తెలికులు

జగ్గంపేట: నియోజకవర్గంలో తెలికులు, దేవ తెలికులు, గాండ్ల తెలికుల సామాజిక వర్గానికి కమ్యూనిటీ హాలు నిర్మించాలని ఆ కులస్తులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఆ సామాజిక వర్గీయులు జగ్గంపేట నుంచి ఇర్రిపాక వరకూ బైక్ ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నామన్నారు. శుభకార్యాలు చేసుకునేందుకు కమ్యూనిటీ హాల్ ఎంతో అవసరమన్నారు. కమ్యూనిటీ భవనానికి 50 సెంట్ల స్థలం కేటాయించడంతో పాటు, నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

నేరేళ్లమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో గోపాలపట్నం నేరేళ్లమ్మ అమ్మవారు

తొండంగి: ఆషాఢ మాసంలో రెండో ఆదివారం సందర్భంగా గోపాలపట్నం నేరేళ్లమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకుడు పేర్రాజు ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, అర్చన, విశేష అలంకరణ నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. సోమవారం అమ్మవారికి శాకంబరి అలంకరణ చేయనున్నట్టు ఆలయ నిర్వాహకుడు యడ్ల శ్రీనివాస్ తెలిపారు.

జగ్గంపేట చేరిన మోటారు సైకిల్ యాత్ర


జగ్గంపేటలో రాజుకు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

జగ్గంపేట: వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీని గెలిపించి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరుతూ నెల్లూరు జిల్లాకు చెందిన అడవికొట్టు రాజు చేపట్టిన మోటారు సైకిల్ యాత్ర ఆదివారం జగ్గంపేటకు చేరుకుంది. గ్రామంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు కార్యాలయాన్ని రాజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకూ 115 నియోజకవర్గాల్లో 8940 కిలో మీటర్ల మేర పర్యటన పూర్తయిందన్నారు. ప్రతి నియోజకవర్గంలోనూ తిరుగుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరిస్తున్నట్టు చెప్పారు. ప్రజల నుంచి సీఎం జగన్ పాలనపై మంచి స్పందన వస్తోందన్నారు. జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పెద్దాడ రాజబాబు, పలువురు వైఎస్సార్ సీపీ నేతలు రాజును అభినందించారు.

ఎంపీపీ అరుణ్‌కుమార్ కుటుంబానికి పరామర్శ


కొత్తపాకలులో ఎంపీపీ అరుణ్‌కుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి రాజా

తొండంగి: అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన తొండంగి ఎంపీపీ అంగుళూరి అరుణ్‌కుమార్ కుటుంబాన్ని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా ఆదివారం పరామర్శించారు. ఒంటిమామిడి పంచాయతీ కొత్తపాకలులో ఎంపీపీ అరుణ్‌కుమార్ పెద్దకర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రాజా పార్టీ నాయకులతో కలిసి అరుణ్ కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అరుణ్ కుమార్ కుటుంబసభ్యులైన తండ్రి అప్పారావు, తల్లి అమ్మాజీ, భార్య సుశీల తదితరులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మంత్రి రాజా వెంట తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, మాజీ చైర్మన్ కొయ్యా మురళి, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, పార్టీ మత్స్యకార విభాగం తుని నియోజకవర్గ కన్వీనర్ మేరుగు ఆనందహరి, పార్టీనాయకులు గాబు రాజు, ఎంపీడీఓ పసుపులేటి సతీష్ తదితరులు ఉన్నారు.

కాలువలో వ్యక్తి మృతదేహం

సామర్లకోట: స్థానిక గోదావరి కాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృత దేహాన్ని ఆదివారం సాయంత్రం పోలీసులు గుర్తించారు. పంచారామ క్షేత్రం, అగ్రికల్చర్ ఫారానికి వెళ్లే మార్గంలోని గోదావరి కాలువలో మృతదేహాన్ని బయటకు తీశారు. బిస్కెట్ రంగు ఫుల్ హ్యాండ్స్ షర్టు, నలుపు రంగు ప్యాంట్ మెడలో ఎరుపు రంగు టవల్ ఉంది. మృతుని వివరాల కోసం 94407 96568 నంబరులో సంప్రదించాలని సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు.